
రాష్ట్ర అవతరణ దినోత్సవంలో సాంస్కృతి ప్రదర్శన చేసిన విద్యార్థులతో అతిథులు


పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బాపట్లలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, అధికారులు పాల్గొన్నారు.

-బాపట్ల

క్లుప్తంగా

నవంబర్‌లో చెకుముకి సైన్స్ సంబరాలు



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండలం ఎంపీరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్సు సంబరాలు 2023 సన్నాహక సమావేశాన్ని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో చెకుముకి సంబరాలను నవంబర్ 10వ తేదీన సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించాలని కోరారు. అనంతరం చెకుముకి సంబరాల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్టు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసరావు, కళాధర్, ప్రభాకర్, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు హైవెండ్ విద్యార్థులు



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండలంలోని హైవెండ్ హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ఉదయ చంద్రరావు బుధవారం తెలిపారు. అక్టోబర్ 26వ తేదీన చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంటూరు జిల్లా స్కూలు గేమ్స్ అండర్- 19 ఫెన్సింగ్ పోటీలు నిర్వహించగా జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కె.నాగజ్యోతి, పి.లావణ్య, ఇంద్రసేనారెడ్డి, ఎస్.శివసాయి పర్ధావ్‌రెడ్డి(పదో తరగతి) ఎంపికైనట్లు చెప్పారు. నవంబర్ 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ చాందినీ, మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్రబాబు, వ్యాయామోపాధ్యాయులు గోపీచంద్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, అనిత, స్వప్న, రహీల అభినందించారు.

ఆటల పోటీలలోనూ ముందుండాలి



రేపల్లె: విద్యార్థులు చదువుతో పాటు ఆటలలోనూ ముందుండాలని పెనుమూడి సర్పంచి దారం విజయ్ అన్నారు. పట్టణంలోని భాష్యం స్కూలులో బాలల దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని స్థానిక స్కూలు ఆవరణలో బుధవారం నిర్వహించారు. పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ పేటేరు గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఆటలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి ఉంటారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచినవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 1 నుంచి 13వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సురేష్, భార్గవి పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఇద్దరికి బహుమతులు

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని కర్లపాలెం ఎంఈఓ విజయశ్రీ తెలిపారు. ఎంపీరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన ఇద్దరికి సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్టు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

షాదీఖానా అభివృద్ధికి కోన చేయూత

బాధ్యతలు అంజుమన్ కమిటీకి అప్పగింత


షాదీఖానాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: షాదీఖానా అభివృద్ధి పనులను అంజుమన్ కమిటీకి అప్పగిస్తునట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి వెల్లడించారు. స్థానిక మార్కెట్ వద్ద ఉన్న షాదీఖానాలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముస్లిం షాదీఖానా బాధ్యతలు అంజుమన్ -ఏ - ఇస్లామియాకు అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. గత ఎన్నో సంవత్సరాలుగా ముస్లిం షాదీఖానా కార్య నిర్వహణలో లేనందున దాని ఆధునికీకరణ చేయుటకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ద్వారా ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు విడుదల చేయిస్తామని చెప్పారు. మున్సిపాలిటీ జనరల్ ఫండ్ ద్వారా మరో 20 లక్షల రూపాయలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. షాదీఖానా అభివృద్ధికి తనవంతుగా రూ.5లక్షలు అందిస్తానని కోన ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ జిలాని, పెద్ద మసీదు ప్రెసిడెంట్ రహీమ్ జానీ, న్యాయవాది జమురుద్ బాషా, సయ్యద్ పీర్ పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి


పెసర్లంకలో అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

భట్టిప్రోలు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కృష్ణానది పరీవాహక తీర ప్రాంత ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. మండలంలోని పెస్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను బృందం సభ్యులు ప్రయోగకపూర్వకంగా చూపించారు. కృష్ణానది సమీపంలో తీర గ్రామాలు ఉండటంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, పెసర్లంక, చింతమోటు సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, వేములపల్లి వీరాంజనేయులు, ఎంఈఓలు పులి లాజర్, నీలం దేవరాజ్, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఎఫ్‌పీజీ రైతులు సేవలను సద్వినియోగం చేసుకోవాలి


భట్టిప్రోలులో ఎఫ్‌పీజీ మహిళా రైతులతో ఎంపీపీ లలిత కుమారి, ఏపీఎం శ్రీమన్నారాయణ

భట్టిప్రోలు: రైతు ఉత్పత్తి సంఘాలు(ఎఫ్‌పీజీ) ఆయా శాఖలు అందిస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకోవాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. భట్టిప్రోలు మండల విద్యా వనరుల కేంద్రంలో ఎఫ్‌పీఓ అధ్యక్షురాలు దోవా ఝాన్సీరాణి అధ్యక్షతన ఎఫ్‌పీజీ లీడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆర్బీకేలలో పని చేస్తున్న సాంకేతిక సిబ్బంది సలహాలు కూడా తీసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని కోరారు. మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న అన్ని ఎఫ్‌పీజీ సంఘాలలోని సభ్యులు అందరూ ప్రతి నెల క్రమం తప్పకుండా పొదుపు చేయడం, సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను సక్రమంగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు రజనీ కుమారి, హనోకు, సాంబయ్య, అకౌంటెంట్ శిరీష పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర అవతరణలో బాపట్ల పాత్ర మరువలేనిది


తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు, విద్యార్థులు

బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణలో బాపట్ల అద్వితీయమైన పాత్రను పోషించిందని, ఆంధ్రోద్యమానికి బాపట్లలోనే బీజం పడిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాల్లో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన అమరజీవి జీవిత కథ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, తెలుగు తల్లి గీతాలాపన చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మాల్యాద్రి, ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, రెడ్ క్రాస్ కార్యదర్శి బి.ఎస్.నారాయణ భట్టు, జిల్లా రైస్ మిల్లర్స్ సంఘ అధ్యక్షుడు బీవీ రత్నగుప్త, డాక్టర్ కే విజయకుమార్, సిహెచ్.వెంకటేశ్వర రెడ్డి, మల్లికార్జున, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు లాల్ అహ్మద్ పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల రాష్ట్ర బంద్



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మనోజ్‌కుమార్

రేపల్లె: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణకై ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ అధికారాన్ని చేపట్టిన దగ్గర నుంచి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెట్టడమే పరిపాలనగా సాగుతుందన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే విషయంతో తమ వైఖరిని మార్చుకోవాలని కోరారు. బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు పాల్గొని సహకరించాలన్నారు.

ఘనంగా సముద్రాల అంకమ్మ విగ్రహ ప్రతిష్ట

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): కర్లపాలెం మండలం ఎంపీరాజు పాలెంలో పిట్టు వారి ఇలవేల్పు సముద్రాల అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా అమ్మవారికి విరాళాలను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.లక్ష రూపాయలు ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఆయన వెంట బాపట్ల ఏఎంసీ చైర్మన్ డి.సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పిట్ల వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఏడుకొండలు, పార్టీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి ఉన్నారు. బాపట్ల టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ వారికి రూ.2 లక్షలు అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు పిట్ల వసంతరెడ్డి గ్రామపెద్దలు ఉన్నారు.అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

ఆర్డీఓ హేలా షారోన్


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హేలా షారోన్

రేపల్లె రూరల్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీ యమని ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహాత్మగాంధీ చూపిన సత్యం, అహింస బాటలో పయనిస్తూ పొట్టి శ్రీరాములు శాంతియుతంగా ఆమరణ నిరాహారదీక్షలు చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా రింగురోడ్డు సెంటరులోని వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పట్టణ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు


అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని బొలిశెట్టి రాంబాబు అన్నారు. కర్లపాలెం మండలంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని గుర్తు చేశారు. తొలుత పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వెంకటసుబ్బారావు, లలితబాబు, శివనాగమల్లేశ్వరరావు, లక్ష్మణ్ కుమార్, నాగ శ్వేతరాజేశ్వరి, రామకృష్ణ, రమేష్, వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

బాపట్ల జిల్లా మేనేజర్ వాణిశ్రీ


వెల్లటూరులో కంద పంట పరిశీలిస్తున్న బాపట్ల డీపీఎం వాణిశ్రీ

కోనేటిపురం(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్య కరమైన పంటలు పండించి మంచి దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని ఆ శాఖ బాపట్ల జిల్లా మేనేజర్ వాణిశ్రీ సూచించారు. బుధవారం కోనేటిపురానికి చెందిన పరిశా సాంబశివరావు, ప్రసన్న సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. అలాగే ఓలేరులోని చేబ్రోలు సునీత, ప్రమీలా రాణి, వెల్లటూరులోని రేవతి సాగు చేస్తున్న వరి పంట పొలాలను కూడా పరిశీలించి ఘమి, ఎ గ్రేడ్ మోడల్, బ్లాక్ విజిట్ విధానాలను గూర్చి రైతులను అడిగారు. రైతులు అడిగిన సందేహాలను ఆమె నివృతి చేశారు. వెల్లటూరులో కంద పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంటీ బాల, ఎల్-1 శివనాగేశ్వరమ్మ, దోవా ఝాన్సీరాణి, ఎల్ఈ సురేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

బాపట్ల: మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ప్రజారోగ్య అవసరాల దృష్ట్యా చిరుధాన్యాల తో తయారు చేసిన ఆహార పదార్థాలు వినియోగించాలని ఆహార విజ్ఞాన కళాశాల విద్యార్థులు ప్రచారం చేపట్టారు. బుధవారం పట్టణంలో ఫుడ్ సైన్స్ కాలేజీ నాలుగో ఏడాది విద్యార్థులు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఆహార పదార్థాలు(రాగి పిండి, రాగి మాల్ట్, దోశ పిండి, మల్టీ మిల్లెట్ పిండి, రాగి మురుకులు, రాగి పిండి)తో తయారుచేసిన లడ్డు వంటి పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలపై పట్టణంలో విక్రయ ప్రచారం చేస్తున్నారు. బీటెక్ విద్యా విభాగంలో చిరుధాన్యాల ఆహార పదార్థాల ప్రచారంలో విద్యార్థులు వెలుగుల సంపత్ శివప్రసాద్, గీతిక, హారిక, అరుంధతి పాల్గొన్నారు.

పెరవలి పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపిక


జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెరవలి(వేమూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.సరోజిని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అండర్ -17 బాలికల విభాగంలో కబడ్డీకి బి కనిష్క జిల్లా జట్టుకు ఎంపికయిందని ఆమె తెలిపారు. గుంటూరు జిల్లా జట్టుకు అండర్ -14 విభాగంలో కె.శ్రీరామ్ ఎంపిక కాగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ టి.బుచ్చిరెడ్డి, రామకృష్ణ, యు.రత్నంరాజు, ఆర్.శ్రీనివాసరావు, మల్లికార్జున, హుసేన్, ప్రసాద్, చిరంజీవి, కృష్ణం రాజు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కమిటీ బాధ్యతల స్వీకారం

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. నూతన అధ్యక్షురాలిగా డాక్టర్ జె.విజయలక్ష్మి, కార్యదర్శిగా వి.పావని ప్రియాంక, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ అనిల్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. ఐఎంఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది.


బోస్‌రోడ్డు జలమయం

ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలకు సేదతీరేందుకు అన్నట్టుగా బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు అర్ధగంటకుపైగా కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. రోడ్లు జలమయమయ్యాయి. పట్టణ, పరిసరాల్లోని కొంత విస్తీర్ణంలోనే కురిసిన వర్షంతో అక్కడి పంటచేల దాహం తీర్చినట్టయింది.

బాల్య వివాహాలు చేయడం నేరం

తెనాలిఅర్బన్: బాల్య వివాహాలు చేయటం చట్టరిత్య నేరం అని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ పి.ఉషారాణి పేర్కొన్నారు. బాల్య వివాహాలపై బుధవారం చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అడపిల్లకు 18 సంవత్సరాలు, మగ పిల్లవానికి 21 సంవత్సరాల వయస్సు నిండకుండా వివాహాలు చేయకూడదని చెప్పారు. అలా చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అనంతరం ఆమె అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైట్స్ ఎడ్వకసి ఫౌండేషన్ ప్రతినిధి కంచర్ల రజని, షేక్ పర్విన్ సుల్తానా, ఆరోగ్య విస్తరాధికారి అందే బాలచంద్ర మౌళి, టీబీ సూపర్‌వైజర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా సర్వకార్యసిద్ధి గణపతి ఆలయ ప్రతిష్ట


సర్వకార్యసిద్ధి గణపతి ని ప్రతిష్ఠించిన శరణగోష్టి పీఠాధిపతి నరేంద్ర రామానుజ దాస స్వామి

చెరుకుపల్లి: గణాలకు అధిపతి అయిన గణపతిని సర్వకార్య సిద్ధి గణపతిగా ప్రతిష్టించుకోవటం గ్రామానికి ఎంతో మేలు అని శరణగోష్టి పీఠాధిపతి నరేంద్ర రామానుజ దాస స్వామి అన్నారు. మండలంలోని కనగాలలో సీతామాలక్ష్మీ గిరిజన కాలనిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంతో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన సర్వకార్యసిద్ధి గణపతి దేవాలయంలో గణపతి విగ్రహాన్ని బుధవారం ఉదయం ప్రతిష్టించారు. అనంతరం ఆలయ పాగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, ఆలయ కమిటీ సభ్యులు కట్టా వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

చంద్రబాబు దొరికిన దొంగ..

భట్టిప్రోలు: చంద్రబాబు రాజమండ్రి జైలు నుంచి బెయిల్‌పై విడుదలైనంత మాత్రాన నిర్దోషి కాదనే విషయాన్ని టీడీపీ నాయకులు గ్రహించాలని వైఎస్సార్ సీపీ నాయకులు హితవు పలికారు. బుధవారం భట్టిప్రోలులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రగల్భాలు పలకడం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో గోలి శ్రీనివాసరావు, మోర్ల కోటేశ్వరరావు, గోల్కొండ సాయి, సుభానీబేగ్ పాల్గొన్నారు.

మీ భూమి- మా హామీ సర్వేకు సహకరించాలి

రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మీ భూమి-మా హామీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని తహసీల్దార్ డి.మల్లికార్జునరావు కోరారు. బుధవారం పేటేరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులు సర్వే నిమిత్తం ఇంటింటికి పర్యటించి సర్వే చేస్తారన్నారు. గ్రామంలో అధికారులు పర్యటించి సర్వే పనులు చేస్తారన్నారు. సర్వేకు గ్రామస్తులు సహకరించి తమ భూములను క్రమబద్ధీకరించుకుని శాశ్వత భూ రికార్డులు పొందాలని తెలిపారు. కార్యక్రంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్ పాల్గొన్నారు.

బాపట్లలో మద్యం బాటిళ్ల పట్టివేత

బాపట్లటౌన్: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ అక్రమంగా సొమ్ముచేసుకుంటున్న ముఠాను బుధవారం బాపట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. చీరాలకు చెందిన ఆలపాటి సురేంద్ర మణికుమార్, షేక్ షాజాహాన్, ఐ.ప్రదీప్ ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొని బాపట్ల పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారంతో పట్టణంలోని గుంటూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మద్యం విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి కారు, 750 ఎం.ఎల్ సామర్థ్యం కలిగిన 49 రాయల్ ఛాలెంజ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లపై హరియాణా రాష్ట్రం స్టిక్కర్లు ఉండటంతో వీరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ సింగయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాలతో మానసిక ఉల్లాసం

తెనాలిఅర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో ఇంటర్నల్ స్పోర్ట్స్ మిట్‌లో భాగంగా బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో క్రీడల ప్రాధాన్యత తగ్గటం బాధకరమన్నారు. అందరు క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో పోటీలను ప్రారంభించారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జి ఎం.హృదయరాజ్, ప్రిన్సిపాల్ పి.రాము, ఛాంప్ హెచ్‌ఎం జిగర్, వైస్ ప్రిన్సిపాల్ మోహన్‌దాసు, వ్యాయమ ఉపాధ్యాయులు డి.రాజేష్, ఐ.నరేష్ పాల్గొన్నారు.